# పెరిగిన బీఆర్‌ఎస్ గ్రాఫ్

## ఖంగుతింటున్న కాంగ్రెస్

**తప్పుడు వాగ్దానాలు, హామీలతో ఓట్లు దండుకునేందుకు కుటిల యత్నం**




- ఇదే చివరి ఎన్నికలు.. గెలిపించి ఆదుకోవాలని కాంగ్రెస్ అభ్యర్థుల వేడుకోలు
- గెలిస్తే పెద్ద పదవి వస్తుందంటూ ఓటర్లను ప్రభావితం చేసే యత్నం
- మూడుగంటల కరెంటు, ధరణి రద్దుపై ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహం
- ఆరు గ్యారంటీలను పట్టించుకోని ఓటర్లు
- దిక్కుతోచని స్థితిలో కాంగ్రెస్ అభ్యర్థులు

సంగారెడ్డి నవంబర్ 28(నమస్తే తెలంగాణ): ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ సంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ గ్రాఫ్ అంతకంతకూ పెరుగుతున్నది. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలు బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రజల మద్దతు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల వైపు ఉండడంతో కాంగ్రెస్‌కు దిక్కుతోచటం లేదు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను ఎదుర్కొలేక కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఖంగుతింటున్నారు. సంగారెడ్డి జిల్లాలో సీఎం కేసీఆర్ బహిరంసభలు, కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు రోడ్‌షోలకు ప్రజల నుంచి అనూహ్యామైన స్పందన వచ్చింది. నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు నియోజవర్గాల్లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు ఊహించన దానికంటే విజయవంతం కావటం, ప్రజల నుంచి మంచి స్పందన రావటం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మింగుడుపడటం లేదు. సీఎం కేసీఆర్ బహిరంగసభలు, సీఎం కేసీఆర్ ప్రసంగాలతో ఓటర్లు బీఆర్‌ఎస్ వైపు మొగ్గుచూపుతున్నారు. దీనికితోడు మంత్రి కేటీఆర్ రోడ్‌షోలు, మంత్రి హరీశ్‌రావు బహిరంగ సభలతో ఓటర్లను ఆకట్టుకోవటంతోపాటు బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపారు. నారాయణఖేడ్‌లో మంత్రి హరీశ్‌రావు నిర్వహించిన రోడ్‌షో ప్రత్యర్థుల్లో గుబులు రేకెత్తించింది. సంగారెడ్డి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ విజయం వైపు దూసుకుపోతుండడాన్ని కాంగ్రెస్ అభ్యర్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో ఎలాగైనా గెలవాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కుటిల రాజకీయాలకు తెరతీస్తున్నారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థులు ఓటర్లకు తప్పుడు వాగ్దానాలు, తప్పుడు హామీలు ఇస్తూ ఓట్లను దండుకునే పనిలో నిమగ్నమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓటర్లను మభ్యపెట్టి, ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు కాంగ్రెస్ అభ్యర్థులు ప్రారంభించినట్లు తెలుస్తుంది.

### ఇవే చివరి ఎన్నికలు.. దయ చూపండి

సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రజాబలం లేకపోవడంతో దొడ్డిదారుల్లో ఓట్లు పొందే ప్రయత్నం చేస్తున్నారు. ఓటర్లకు తప్పుడు వాగ్దానాలు, అలవిమాలిన హామీలు ఇస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నం కాంగ్రెస్ అభ్యర్థులు మొదలుపెట్టారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో ఉన్న ఓ సీనియర్ నాయకుడు 'ఇవే నాకు చివరి ఎన్నికలు...ఈ ఎన్నికల్లో మీరు గెలిపించకపోతే నా రాజకీయ జీవితం ముగుస్తుంది దయచూపండి' అంటూ ఓటర్లను వేడుకుంటున్నారు. గతంలో పెద్ద పదవుల్లో ఉన్నప్పుడు ఎన్నడూ ప్రజలను గౌరవించని, నియోజకవర్గాన్ని పట్టించుకోని కాంగ్రెస్ అభ్యర్థి ఇప్పుడు నా రాజకీయ జీవితాన్ని కాపాడండి అంటూ వేడుకోవటాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఇప్పుడు ఆ నేత మాటలు విని ఓట్లు వేసి గెలిపిస్తే మళ్లీ ఇంటి గేటు ముందు పడిగాపులు పడాల్సివస్తుందని, అలాంటి పరిస్థితి మళ్లీ తెచ్చుకోమని ఓటర్లు చెబుతున్నారు. మరో నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి 'నేను గతంలో చేసిన తప్పులను క్షమించండి..ఈసారి ఎలాగైనా నన్ను గెలిపించండి..నా పార్టీ అధికారంలోకి వస్తే నాకు పెద్ద పదవి వస్తుంది' అంటూ ఓటర్లను ప్రభావితం చేసే యత్నం చేస్తున్నారు. అయితే ప్రజలు ఆ కాంగ్రెస్ అభ్యర్థి మాటలను పట్టించుకోవటం లేదు. పొరపాటున కాంగ్రెస్ అభ్యర్థి మాయమాటలు నమ్మి గెలిపిస్తే ప్రజలవైపు కన్నెత్తి కూడా చూడడని, అవినీతి పెచ్చరిల్లిపోతుందని నియోజకవర్గ ఓటర్లు భయపడుతున్నారు. అందుకే నిత్యం ప్రజల వెన్నంటి ఉండే నేతకు మద్దతు ఇస్తామని ప్రైవేటు సంభాషనల్లో చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ప్యారాచూట్ అభ్యర్థి వ్యవహార శైలి, ప్రచార సరళి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఒకప్పుడు పెద్దపదవులు నిర్వహించిన ఆ అభ్యర్థికి సొంత ఊరు గుర్తుకు రాలేదు, సొంత ఊరు అభివృద్ధి పట్టలేదు, ఇప్పుడు అకస్మాత్తుగా వచ్చి నన్ను గెలిపించండి అంటూ మీకు అండగా ఉంటానని చెబుతుంటే ప్రజలు నమ్మటం లేదు. తన తండ్రి పేరు ను వాడుకునే గెలుపు తీరాలకు చేరుకోవాలని మరో నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి ప్రయత్నిస్తున్నారు. బీసీ నినాదంతో మరో కాం గ్రెస్ అభ్యర్థి ప్రజలను బురిడీకొట్టించే ప్రయత్నా లు చేస్తుండటాన్ని చూసి అందరూ నవ్వుకుంటున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు తమకు ఓటు వేస్తే నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తాం, ప్రజా సమస్యలను ఎలా పరిష్కరిస్తామో చెప్పకుండా తమ పదవుల కోసం, రాజకీయ జీవితాన్ని కాపాడుకోవటం కోసం ఓట్లు అడగటాన్ని అన్నివర్గాల వారు తప్పుబడుతున్నారు.

### మూడు గంటల కరెంటు, ధరణి రద్దుపై ప్రజల్లో ఆగ్రహావేశాలు

వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలు, ధరణి రద్దు చేస్తామంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంపై సంగారెడ్డి జిల్లాలోని ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఇటీవల వ్యవసాయానికి మూడుగంటల విద్యుత్ చాలు అని, పది హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటూ చెప్పారు. కాంగ్రెస్ ఓటువేస్తే 24గంటల కరెంటు స్థానంలో మూడుగంటల కరెంటు వస్తుందని, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాల్సి వస్తుందని జిల్లాలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ తీరు ఉండడంతో సర్వత్రా ఆ పార్టీపై ఆగ్రహం వ్యక్తమవుతుమది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను సైతం ప్రజలు నమ్మటం లేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు తమకు ఓటు వేస్తే ఆరు గ్యారంటీలు ఇస్తామని చెబుతున్నారు. అయితే ఇటీవల కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచి అక్కడా ఐదు గ్యారంటీలు ప్రకటించి ఒక్కటి కూడా అమలు చేయలేదు. ఇది తెలుసుకున్న ప్రజలు, రైతులు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను విశ్వసించటం లేదు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులకు ఏమిచేసి ఓటర్లను ఆకట్టుకోవాలో తెలియక సతమతమవుతున్నారు.

# బీఆర్‌ఎస్ వెన్నంటే గిరిజనం

## గిరిజనుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట

- గ్రామ పంచాయతీలుగా మారిన తండాలు
- సంగారెడ్డి జిల్లాలోని 90కిపైగా తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ప్రభుత్వం
- తండాలకు బీటీరోడ్లు, అభివృద్ధి పనులు
- ప్రత్యేకంగా ఎనిమిది గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలల్లో 3,850 మంది విద్యార్థులు ఉచితంగా ఉన్నత విద్య
- 1127 మందికి 1808.07 ఎకరాలకు సంబంధించి పట్టాలు అందజేసిన ప్రభుత్వం

సంగారెడ్డి నవంబర్ 28(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలోని గిరిజనుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేసింది. గిరిజనుల సంక్షేమం, తండాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోలేదు. తమ అభివృద్ధికి అన్నివిధాలా ఆదుకున్న కేసీఆర్ వెన్నంటే సంగారెడ్డి జిల్లాలోని గిరిజనులు నడవనున్నారు. ఇటీవల నారాయణఖేడ్‌లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన పీసీసీ చీఫ్ రేవంతరెడ్డి గిరిజనులను అవమానించారు. కాంగ్రెస్ బహిరంగ సభలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ చిత్రపటం ఇచ్చేందుకు వెళ్లగా చిత్రపటాన్ని పక్కకు నెట్టడంతోపాటు గిరిజనులను తోసివేసి అవమానించారు. రేవంత్‌రెడ్డి తీరుపై సంగారెడ్డి జిల్లాలోని గిరిజనులు గుర్రుగా ఉన్నారు. నారాయణఖేడ్‌తోపాటు ఇతర ప్రాంతాల్లోని గిరిజనులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలియజేశారు. సీఎం కేసీఆర్ గిరిజనుల ఆరాధ్యదైవమైన సేవలాల్ మహరాజ్‌కు అత్యంత విలువ ఇవ్వటంతోపాటు హైదరాబాద్‌లో గిరిజనభవన్ నిర్మించి ఇచ్చారని, సంగారెడ్డి జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి పాటుపడ్డారని ప్రస్తుత ఎన్నికల్లో ఆయనకే మద్దతు ఇస్తామని గిరిజనులు చెబుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్, అందోలు, సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో గిరిజనుల ఎక్కువ సంఖ్య ఎక్కువగా ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వాలు గతంలో గిరిజనుల సమస్యలను, డిమాండ్లను పట్టించుకోలేదు. గిరిజనులు తండాలను పంచాయతీలుగా మార్చాలని, రహదారులు, కరెంటు సౌకర్యం కల్పించాలని కోరుతూవచ్చారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిపుత్రుల కలలను నెరవేర్చి అభివృద్ధికి పాటుపడింది.


కంగ్టి మండలంలోని జీర్గితండాకు వేసిన నూతన బీటీరోడ్డు



కంగ్టిలోని గిరిజన గురుకుల కళాశాల భవనం

### గిరిజనులకు పోడు భూముల పంపిణీ

ప్రభుత్వం సంగారెడ్డి జిల్లాలోని గిరిజన తండాల అభివృద్ధితోపాటు గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. 90కిపైగా తండాలను పంచాయతీలుగా మార్చింది. కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు కేటాయంచింది. జిల్లాలో 47 గిరిజన పంచాయతీల్లో కొత్త పంచాయతీ భవనాలను నిర్మించింది. తండాలకు రహదారుల నిర్మాణం కోసం రూ.6.38 కోట్ల నిధులు విడుదల చేసింది. 119 గిరిజన ఆవాసాల్లో త్రీఫేస్ కరెంట్ సరఫరా సదుపాయం కల్పించింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులు ఖర్చు చేసింది. జిల్లాలోని 6675 గిరిజన కుటుంబాలకు 101 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా సరఫరా చేస్తుంది. ఇందుకోసం ప్రతిఏటా రూ.4 కోట్లు ఖర్చు చేస్తుంది. గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఎనిమిది గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసింది. 3850 మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా గిరిజన రెసిడెన్షియల్ లా కాలేజీని ఏర్పాటు చేసింది. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడుభూములకు భూయాజమాన్య హక్కులు కల్పించాలని ఏండ్లుగా ఆందోళన చేస్తూవచ్చారు. సీఎం కేసీఆర్ గిరిజనుల కలను నెరవేర్చారు. జిల్లాలో పోడుభూములు సాగుచేసుకుని జీవనంసాగిస్తున్న 1127 మందికి 1808.07 ఎకరాలకు సంబంధించి పట్టాలు అందజేశారు. ఝరాసంగం మండలంలో ఏడుగురు రైతులకు 19 ఎకరాలు, జహీరాబాద్ మండలంలో 213 మందికి 123.57 ఎకరాలకు సంబంధించి పట్టాలు అందజేశారు. కోహీర్ మండలంలో 168 మంది రైతులకు 218.57 ఎకరాలు, మొగుడంపల్లి మండలంలోని 593 మంది రైతులకు 1392.52 ఎకరా లు, వట్‌పల్లి మండలంలోని 145మంది రైతులకు 53.16 ఎకరాలు, చౌటకూరు మండలంలోని ఒకరికి 1.25 ఎకరాలకు సంబంధించి పట్టాలు అందజేశారు.